## ఇంజరపు లక్ష్మి

# ఎందు దాగివున్నావో

అర్ధరాత్రి..

దోమల్‌గూడాలోని ఆ సందు చీకటి గుయ్యారంలా వుంది.

సందు మొగలో వెలగని కార్పొరేషను లైటు అక్కడి ప్రజలపై అలిగిన మునిసిపాలిటీ వారి అశ్రద్ధకు సంకేతంలా వుంది.

బేరంలేక బోరెక్కిన వేశ్యల్లా వరుసగా నిలబడ్డ ఇళ్లు అతిగా మందుకొట్టి అసలు పని మరిచి ఆదమరిచి నిద్రపోతున్న విటుల్లా నిశ్శబ్దంగా వున్నాయి.

సరిగ్గా ఆ నిశిరాత్రి నీరవంలో...

సూరీడు ఆ సందులో అడుగుపెట్టాడు.

అమ్మానాన్నలు పెట్టిన పేరు సూరీడయినా అతనెప్పుడూ చీకటిలోనే సంచరిస్తుంటాడు.

దానిక్కారణం పగటిపై వెగటు పుట్టికాదు.

పుట్టగానే అమ్మపోయినా సూరీడుకి పదేళ్ళ వయసొచ్చేవరకూ పోకుండా మిగిలిన తండ్రి చీకటి గురించి శ్రద్ధగా వివరించేవాడు.

వెలుగులో హాయిగా తిరిగేసే చాలామంది గొప్పవాళ్లు వెధవ పనులు చేయడానికి చీకటినే ఎందుకు ఎన్నుకుంటారో అసలు మనిషి బ్రతుకులో చీకటికున్న ప్రాముఖ్యత ఏమిటో చక్కగా ఉగ్గుపాలతోనే నూరిపోసేసాడు.

జేబులు మాత్రం కొడుతూ బ్రతికేసే సూరీడు తండ్రి తన కొడుకు ఏకంగా బేంకుల్ని బ్లాక్‌మనీని దోచుకోగల సమర్థుడు కావాలని కలలుకంటూ అభివృద్ధి అన్నది లేనివాడు మనిషి బతుక్కి అర్థం లేదని గట్టిగా వాక్రుచ్చేవాడు.

అంతే..

అప్పటినుంచీ సూరీడుది చీకటి బ్రతుకైపోయింది.

దురదృష్టవశాత్తూ తండ్రి కోరుకున్న దశకి ఎదక్కుండానే చెంబులు తపేళాలు కొట్టేస్తూ దొరికిపోయి చిల్లర దొంగగా స్థిరపడి రెండు మూడుసార్లు కటకటాలు లెక్కపెట్టేసాడు.

సరిగ్గా అప్పుడే తండ్రి కలలోకొచ్చి తన కడుపున చెడబుట్టేవని గట్టిగా కసురుకున్నాడు.

ప్రయోజకుడైన కొడుకును చూసినపుడే ప్రతి తండ్రికి పున్నామ నరకం నుంచి తప్పించుకున్నంత తృప్తి అన్నాడు.

అర్జెంటుగా ఉన్నింటి నొకదాన్ని దోచుకుంటే తప్ప తన ఆత్మ ఇలా అఘోరిస్తూనే వుంటుందని ఖిన్నవదనుడై మాగన్నుగా నిద్రపోతున్న సూరీడుని మేల్కొలిపేసాడు.

ఇది జరిగి సరిగ్గా వారం రోజులైంది.

అందుకే సేంపిల్‌గా ఓ ఇంటిని ఎన్నుకున్నాడు సూరీడు.

ఆ ఇల్లు దోమల్‌గూడాలో వుంది.

కాని ఆ ఇంట్లో ఎవరూలేరు.

నాలుగురోజులుగా పగటిపూట పరిశీలించేడు.

పిట్టలుగాని మనుషులుగాని సంచరిస్తున్న జాడలేక పోవడంతో అదే సరైన ఇల్లని నిర్ధారించుకుని అక్కడ కొట్టేసిన డబ్బుల్తో తండ్రి వర్ధంతికి ఓ పట్టు పంచెని మూలన పెడదామని సంకల్పించాడు.

సూరీడు నడుస్తున్న వాడల్లా టక్కున ఆగేడు ఆ ఇంటి ప్రహరీ,గోడ దగ్గర.

అటూ ఇటూ చూసేడు.

వీధి నిర్మానుష్యంగా వుంది.

ఇంటి మెయిన్ గేట్‌వైపు దూరంగా వున్న ఓ కార్పొరేషన్ లైటు కాంతి పడుతుండడంతో సందువేపు గోడెక్కి అమాంతం లోపలికి దూకేసాడు.

సూరీడు గుండె క్షణంపాటు వేగంగా కొట్టుకుంది.

చచ్చి పై లోకంలో వున్న తండ్రిని ఓ మారు గుర్తుచేసుకున్నాడు. దూరంగా ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి.

"నా సర్వీసులో ఇదే పెద్ద ప్రయత్నం నాన్నా! నన్ను ఆశీర్వదించు వీర దొంగగా నన్ను కాపాడు" అనుకుంటూ రెండు అంగలలో కిటికీని చేరుకున్నాడు.

"బాబూ సూరీడూ. వీరోలా లోపటికి అడుగెట్టినోడెవ్వడూ సేమంగా బయటికిరాలేదు. కూసింత అభిమన్యుడి కథ గుర్తు చేసుకో. పోటుగాడినాగ నోపటికెళ్ళాడు. ఒళ్లు వూనం చేసుకొని సచ్చూరుకుండు.అదే మన తెల్గు చినేమాల్లో సూడు వీరోగాడు వీరోయిన్‌కాడగ్గాని, వీరో దొంగ అయితే బేంకులు దోపిడీలు సేసేటప్పుడుగాని ప్రయినేజీ

**అతడు చూస్తుండగానే పక్కగది ద్వారం తెరుచుకోవడమూ రెప్పపాటులో గదిలో లైటు వెలగడమూ ద్వారం దగ్గర ఓ అంధమైన అమ్మాయి నిలబడి 'ఎవర్నువ్వు' అంటూ నిలదీయడమూ ఆ కేటుగాడు ఖంగు తినడం...**

బొక్కల్లోనుంచి యెల్లి యెనకపీటిన అంతా సాధించి యిజయవంతంగా యెలిపొచ్చేస్తుంటాడు. సరిత్రంటే అదేమరి అంతెందుకు 'దొడ్డితోవంట సీట్లు సంపాయించేవోడు గెలిసి ఆనక మంత్రయి పోతాడు. ఇలా సెప్పుకుంటా పోతే బోలెడంత కతుంది. అంసేత నాను సెప్పేదేటంటే...

తండ్రి ప్రబోధనలు గుర్తు చేసుకుంటున్న సూరీడు నెమ్మదిగా ఓ కిటికీని నెట్టేడు.

ఆశ్చర్యం.

స్వర్గంలోని తండ్రి తనకు సహకరించినట్లు అది తెరుచుకుంది. మనిషి దూరేటంత ఖాళీ వుండటంతో అమందానందంగా లోపలికి అడుగుపెట్టబోతూ మళ్లీ ఆశ్చర్యపోయాడు.

అక్కడలోపల ఓ పెన్‌టార్చి వెలుగు కదులుతూంది:

సూరీడు గుండెలు దడదడలాడేయి:

కొంపదీసి తండ్రి ఆత్మ తనకంటే ముందు వచ్చి ఇనప్పెట్టె కోసం వెదుకుతుందేమో అనుకున్నాడు.

అరక్షణంలో తెలిసిపోయింది. అది తండ్రి ఆత్మకాదని తనలాంటి కేటుగాడెవడో తనకంటె ముందొచ్చి చిట్టాడే ప్రయత్నం చేస్తున్నాడని, కిటికీ నుండే చొరబడిపోయుంటాడు కేటుగాడు అని మంటగా అనుకున్నాడు సూరీడు.

అప్పటికే పెన్‌టార్చి వెలుగులో ఓ రేక్ తెరుచుకుంది.

సూరీడుకు ముచ్చెమటలు పోసాయి.

అలాగే ఆలోచిస్తూ నించుంటే ఆ డబ్బూ దస్కం కాస్తా నెంబరు వన్నుగాడు మూటగట్టేసుకోడం తనకో 'కందు' జెల్లిచ్చి ఎంచక్కా పారిపోవడమూ దాంతో తండ్రి ఆత్మ ఘోష పెట్టడమూ సీరియల్‌గా జరిగిపోతాయి.

ఇక లాభం లేదు.

విజయమో వీర స్వర్గమో అన్నట్టు కేటుగాడ్ని ఢీకోవాలి.

వాడు ఓడితే మొత్తం తన పరమౌతుంది

లేదంటే..

సగం వాటా అయినా తన సొంత మౌతుంది.

చాలబలంగా నిర్ణయించేసుకుని లోపలికి అడుగుపెట్టబోయాడు.


సరిగ్గా అప్పుడే మరో విచిత్రం జరిగింది.

అతడు చూస్తుండగానే పక్కగది ద్వారం తెరుచుకోవడమూ రెప్పపాటులో గదిలో లైటు వెలగడమూ ద్వారం దగ్గరే ఓ అందమైన అమ్మాయి నిలబడి 'ఎవర్నువ్వు' అంటూ నిలదీయటమూ ఆ కేటుగాడు ఖంగుతినడమూ అన్ని ఒకదాని వెంట మరొకటి...

"హోర్నీ! ఇంటివాళ్లు వచ్చేసినట్టున్నారు." కిటికీ వార

వక్కేసిన సూరీడు తను తొందర పడి ముందే అడుగు పెట్టివుంటే ఎంత ఘోరమై పోయేదీ అనుకున్నాడు.

ఆ తర్వాత ఏమి జరుగుతుందా అన్న ఉత్సుకతతో సూరీడు అబ్బురంగా చూస్తూ వుండిపోయాడు.




నగలమూటతో కేటుగాడు బయటికి పరుగెత్తబోతుంటే ఆ అమ్మాయి భయంతో ముందో అడుగు వెనక్కివేసింది. ఆ వెంటనే అతడ్ని మగరాయుడిలా ఢీకొంది.

కేటుగాడు ఆమెను అమాంతం పక్కకి నెట్టేసాడు.

అంతేకాదు మీద కలియపడిన ఆమె కేక వేయడానికన్నట్టు నోరు తెరవబోతుంటే చేత్తో నోరు నొక్కేసాడు.

ఆమె పెనుగులాడుతోంది.

సూరీడు గుండె జాలితో నిండిపోయింది.

ఒక అందమైన అమ్మాయి అందులో వయసులో పిట పిట లాడుతున్న అతివకి అలాంటి కష్టం కలగడం కించిత్తు కూడా సూరీడుకు నచ్చలేదు.

అర్ధరాత్రి దొంగతనాల గురించి తప్ప 'అయ్య' అమ్మాయిల ఆపదల గురించి అసలు ఏనాడూ చెప్పలేదు.

అయినా సూరీడు ఏదన్నా చేయాలనుకున్నాడు.

ఇక వచ్చిన పని ఎలాగూ జరిగే అవకాశం లేదు కాబట్టి కనీసం అమ్మాయికి సహకరించి ఆమె అభిమానాన్నయినా మూటగొనాలని ఆవిధంగా ఏమన్నా ఆమె ముట్ట చెపితే అదే పదివేలుగా భావించాలని తలపోసిన వాడై ఇక జాప్యం చేయకుండా 'ఆగు' అని అరిచాడు సినిమాలోలా.

వెంటనే లోపలికి దూకేసాడు.

అమ్మాయి కళ్లు మెరిసాయి.

దొంగ ఆమెను వదిలి సూరీడుపై కలియబడ్డాడు.

ఇద్దరి మధ్య హోరాహోరీ పోరాటం జరగలేదు.

కాని 'అర్ధరాత్రి నీ మద్దెల దరువేంటోయ్' అన్నట్టు చాచి సూరీడు నెత్తిమీదొకటిచ్చాడు.

ఆ పెనుగులాటలో జారిపడిన మూట సంగతి మరిచి కాళ్ళకి బుద్ధి చెప్పాడు.

"హమ్మయ్య" అనుకుంటూ ఆ అమ్మాయి నగలమూట అందుకుంది.

"సమయానికొచ్చారు మీ మేలు జన్మలో మరవలేను" అని కూడా అని కృతజ్ఞతగా సూరీడు చేతుల్ని పట్టుకుంది.

ఇన్నాళ్ళు చేతులకు బేడీలు తప్ప అందమైన ఆడపిల్ల పరామర్శలు అలవాటు లేకపోవడంతో బోలెడంత సిగ్గుపడిపోయాడు.

"వైజాగు నుంచి ఓ గంట క్రితమే వచ్చాను రేపు

ఉదయమే మా చెల్లి పెళ్ళికి తిరుపతి బయలుదేరాలికదా అనుకుంటూ జస్ట్ రిలాక్సయ్యాను..అంతే ఇంతలో ఈ దొంగ..'' ఆమె మోడస్టీగా సూరీడును చూసి ''పాపం దెబ్బతగిలినట్టుంది. కదూ'' అంటూ చేత్తో అతడి నుదుటిని స్పృశించింది.

సూరీడు మెలికలు తిరిగిపోయాడు.

''కూర్చోండి కాఫీ తీసుకొస్తాను'' అంది కదులుతూ.

''వద్దులెండి..వెళతాను'' అన్నాడు. ఆమె ఏమీ ముట్టచెప్పేట్టు లేదని నిర్ధారణకు వచ్చేయడంతో

''పర్వాలేదు ఉండండి'' గోముగా చూసింది.

సూరీడు మనసుపై గులాబీరేకుతో మెత్తగా రాసినట్టనిపించి ఇహిహి నేను..సెకెండ్ షో సినిమాకి వెళ్లి వస్తుంటే..యిక్కడ గొడవ..అందుకే నీళ్ళనముల్తూ చెప్పాడు తన రాకను ఆమె ఎక్కడ అపార్థం చేసుకుంటుందో అని.

''ప్లీజ్'' లాలనగా చూసింది ఈ రాత్రికి యిక్కడే వుండిపోరాదూ.''

''నేనా..ఎ...ఎందుకండి'' ఉండిపోవాలని వున్నా అందమైన ఆడపిల్లతో ఉంటే అర్జెంటుగా వాళ్ల తాలూకువాళ్లెవరన్నా వచ్చి ఒళ్లు వాయగొడతారేమో అని సంకోచంగా చూసేడు.

''మీరు ఉంటున్నారు... దట్సాల్'' ఆమె చనువుతో శాసించినట్టుగా చూసింది.

అంతే

సూరీడు నీరు కారిపోయాడు.

అలాగే ఈజీ ఛైర్‌లో విశ్రమించాడు.

చాలా బడలికగా వుంది. ఆ బడలికలో కూడా ఆనందంగా వుంది.

ఒక అందమైన ఆడపిల్ల పైగా ఉన్నింటి అమ్మాయితో ఇలా పరిచయం కావడం ఇది తొలిసారి. ఒక అమ్మాయి కోసం ఫైట్ చేయడమూ తొలిసారే..అమ్మాయి అర్ధరాత్రి వేళ తనతో పాటు ఉండి పొమ్మనడమూ తొలిసారే.

ఇన్ని విశేషాలు జరిగిన ఈ తొలిసారి సూరీడు ఎంత పరమానంద భరితుడయ్యాడూ అంటే అరక్షణంలో స్వప్నంలోకి జారిపోయాడు.

'ప్లీజ్' శాశ్వతంగా నాతోనే వుండిపోరూ?

'ఇంత ఆస్తివుంది. మీకీ దొంగబుద్ధులెందుకు'

'నా శీలాన్ని రక్షించినవాడే నాకు తగినవాడు.

పులకరింతగా ఏవేవో వూహించుకుంటూ కలవరిస్తున్న సూరీడు అలా ఎంతసేపు వున్నాడో తెలీదు.

'గెటప్' అన్న ఓ చిన్న అరుపుతో ఉలికిపడి కళ్లు తెరిచాడు.

ఎదురుగా పోలీసులు

''ఏం.ఏం నేనేం చేసాను.'' గొంతుతడారిపోతుంటే అటూ ఇటూ చూసేడు లేచి నిలబడి.

''ఇడియట్.. యూ ఆరండరరెస్ట్'' సినిమా యస్సైలా అన్న యస్సై సినిమాలోలా 'కాక లాఠీతో సూరీడ్ని ముందుకునెట్టి ఈడ్చుకుపొమ్మన్నట్టు కానిస్టేబుల్ కేసి చూసేడు.

''ఈడి మొఖం చూస్తుంటే పరమ కేటుగాడి వాగున్నాడండి'' ఎంత దర్జాగా తొంగున్నాడో సూడండి. అమ్మో పక్కింటోళ్లు ఫోను సెయ్యబట్టిగాని లేకపోతే యిల్లంతా తెల్లారేసరికి ఒక్క ఇటుక ముక్క కూడా లేకుండా కొల్లగొట్టేసేవోడు'' కానిస్టేబుల్ అంటున్నాడు.

పక్కింటోళ్లు ఫోన్ చేయడమేమిటి.

అసలు ఇందాకటి ఆ అమ్మాయి ఏమైంది.

సూరీడు అదురుపాటుగా చూస్తున్నాడు పక్కద్వారం కేసి.

కానీ సూరీడుకి తెలీదు.

ఇందాక తనను అభినందించిన అమ్మాయికూడా తనలాగే దోపిడీకని వచ్చిన బాపతని. దొంగ సొమ్ము కోసం వచ్చిలోపల అప్పటికే మరో కేటుగాడుండటంతో ఖంగుతిని తననే యుక్తిగా వాడుకుని వాజమ్మని చేసి సొమ్ముతో పారిపోయిందనీను. *




తెలుగుపాఠం చెబుతున్న మాస్టారు

''అతిజాగ్రత్తపరుడంటే ఎవరా ప్రసాద్'' అని అడిగాడు.

''దినపత్రికకు అట్టవేసేవాడు సార్'' చెప్పాడు ప్రసాద్.

—డి. సత్యమూర్తి (వాడ్రేవుపల్లి)

# మగాళ్ళున్నారు జాగ్రత్త!